సాక్షి
విజయనగరం
శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



పట్టుబడిన మాయ'లేడీ'

రద్దీ ప్రాంతాల్లో ఏమరుపాటుగా ఉన్న వ్యక్తులను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న మాయలాడిని రాజాం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

- 8లో



అభివృద్ధి పనులకు శ్రీకారం

పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని సీతారామస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులను మూడు నెలల వ్యవధిలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సూచించారు.

- 8లో



ఉన్న ఊరిలో 'ఉపాధి'

జిల్లాలో ఉపాధి వేతనదారుల జాతర కొనసాగుతోంది. పల్లెల్లో ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి.

- 8లో

న్యూస్‌రీల్

కోవిడ్ కేసు నమోదు

- నాలుగుకు చేరిన కేసులు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో మరో కోవిడ్ కేసు గురువారం నమోదయింది. దీంతో కేసుల సంఖ్య నాలుగుకు చేరింది. ఎస్.కోట మండలానికి చెందిన ఓ వ్యక్తి దగ్గు, ఆయాసం, జ్వరంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చారు. అతనికి కోవిడ్ పరీక్ష చేయగా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఆస్పత్రిలోని కోవిడ్ ఐసోలేషన్ ఉంచి చికిత్స అందిస్తున్నారు.

మర్యాదపూర్వక కలయిక



వీసీని సత్కరిస్తున్న లజపతిరాయ్

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) వీసీ ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్యను అంబేడ్కర్ యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్, ఏపీ సెంట్రల్ ట్రైబల్ వర్సిటీ మాజీ స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ హెచ్.లజపతి రాయ్ గురువారం కలిసి అభినందించారు. నూతనంగా ఏర్పడిన యూనివర్సిటీ మొదటి వీసీ నాయకత్వంలో అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: వైద్యారోగ్యశాఖ పరిధిలోని ఐడీఎస్‌పీలో ఎపిడిమాలజిస్టు, ఆర్‌బీఎస్‌కెలో డెంటల్ టెక్నీషియన్ 2 పోస్టులు, ఆడియాలజిస్టు కమ్ స్పీచ్ తెరపిస్టు పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. మే నెల 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సౌతాఫ్రికా వెళ్లేందుకు సహకరించండి

- జెడ్పీ చైర్మన్‌ను కోరిన టెన్నీకాయిట్ క్రీడాకారిణి



జెడ్పీ చైర్మన్‌ను కలిసిన టెన్నీకాయిట్ క్రీడాకారిణి రెడ్డి మౌనిక

చీపురుపల్లి: సౌతాఫ్రికాలో జరగనున్న 5వ ప్రపంచ టెన్నీకాయిట్ చాంపియన్‌షిప్ పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక సహకారం అందించాలని గరివిడి మండలం కె.ఎల్.పురం గ్రామానికి చెందిన టెన్నీకాయిట్ క్రీడాకారిణి రెడ్డి మౌనిక విన్నవించింది. చీపురుపల్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును గురువారం కలిసి లిఖిత పూర్వకంగా వినతిపత్రం అందజేసింది. 2023 సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 8 వరకు సౌతాఫ్రికాలో 5వ ప్రపంచ టెన్నీకాయిట్ చాంపియన్‌షిప్ జరగనుందని, దీనికి సంబంధించి మే 10 నుంచి 23 వరకు చెన్నైలో గల సూరాపేటలోని వెలమ్మల ఇంజినీరింగ్ కళాశాలలో ప్రాబబుల్స్‌కు శిక్షణ జరగనున్నట్టు మౌనిక స్పష్టం చేసింది. భారతదేశం నుంచి ప్రపంచ చాంపియన్‌షిప్‌కు వెళ్లేందుకు ప్రతీ రాష్ట్రం నుంచి ఇద్దరు ప్రాబబుల్స్‌ను ఎంపిక చేయగా అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపిక చేసిన ఇద్దరిలో తాను ఉన్నట్టు పేర్కొంది. చెన్నైలో ప్రాబబుల్స్ శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం సౌతాఫ్రికా వెళ్లాల్సి ఉందని, దీనికి ప్రయాణ, వసతి సంబంధిత అవసరాలు కోసం ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తిచేసింది. దీనికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించారు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. తప్పకుండా సహకారం అందజేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పలాస వైఎస్సార్‌సీపీ పరిశీలకులు కె.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు పి.సి.స్వరూప్ పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష రేపు

విజయనగరం ఫూల్‌బాగ్: జవహర్‌నవోదయ విద్యాలయాల్లో (కిల్తంపాలెం) 2022-23 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించిన పరీక్ష ఈ నెల 29న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరుగుతుందని కిల్తంపాలెం నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పి.దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు అరగంట ముందు నిర్ణీతపరీక్ష కేంద్రానికి హాజరుకావాలని కోరారు. హాల్‌టిక్కెట్ (అడ్మిట్‌కార్డు)లో ఉన్న మాధ్యమంలోనే పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. హాల్‌టిక్కెట్, బాల్‌పాయింట్‌పెన్, వాటర్‌బాటిల్ తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు. విజయనగరం జిల్లాలో 28 పరీక్ష కేంద్రాలను, పార్వతీపురం మన్యం జిల్లాలో 9 కేంద్రాల్లో పరీక్ష జరగనుందని తెలిపారు.

● టెంటే రక్ష...



జిల్లాలో ఉపాధిహామీ పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రతిరోజూ రెండు పూటలా జరిగే పనుల్లో జిల్లా వ్యాప్తంగా 2.09 లక్షల మంది వేతనదారులు పాల్గొంటున్నారు. ఎండలు తారెత్తిస్తుండంతో ప్రభుత్వం పంపిణీ చేసిన టెంట్లను పని ప్రదేశంలో ఏర్పాటుచేసుకుని సేదతీరుతున్నారు. దీనికి తెర్లాం మండలం గోపాలవలస పంచాయతీ కంసాలి బందలో గురువారం కనిపించిన ఈ చిత్రమే నిదర్శనం.

– తెర్లాం

● సిందూర సోయగం



సంధ్యాసమయం.. సూర్యుడు అస్తమించే వేళ... కిరణ స్పర్శకు ఆకాశం సిందూరమయంగా మారింది. ఎరుపు కాంతులతో తళతళమెరిసింది. ఎర్ర సముద్రాన్ని తలపించింది. విజయనగరం జిల్లా కేంద్రానికి సమీపంలోని కొండకరకాం రోడ్డుపై ప్రయాణించేవారికి గురువారం కనిపించిన ఈ అద్భుత దృశ్యం కాసేపు మురిపించి మైమరిపించింది.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి, తదితరులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయాన్ని అమ్మవారి కళ్యాణ మండపం ఆవరణలో గురువారం లెక్కించారు. ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 29 నుంచి ఏప్రిల్ 27 వరకు హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించామన్నారు. చదురుగుడి హుండీల నుంచి రూ. 9,82,477లు, బంగారం 4 గ్రాముల 250 మిల్లీ గ్రాములు, వెండి 79 గ్రాములు లభించిందన్నారు. వనంగుడి హుండీల నుంచి రూ. 1,86,012లు, ఒక గ్రాము 300మిల్లీగ్రాముల బంగారం, 31 గ్రాముల వెండి లభించిందన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ తనిఖీదారు పి.వి.లక్ష్మి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు

- జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి అనూహ్య స్పందన
- 29లోగా జిల్లాలో శతశాతం కుటుంబాలతో మమేకం
- చంద్రబాబు చేసిన మోసం ప్రజలు మర్చిపోలేదు
- 36 నెలల్లో భోగాపురం విమానాశ్రయం పనులు పూర్తి
- ఇక్కడి నుంచి విమానంలో వెళ్లాలనే అశోక్ కల నెరవేరుస్తాం
- నెల్లిమర్ల నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు
- 3న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిష్యత్ ఆధారపడి ఉందని, అదే విశ్వాసాన్ని ప్రజలు సైతం వ్యక్తం చేస్తున్నారని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఉద్ఘాటించారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై 'జగనన్నే మా భవిష్యత్తు' పేరిట చేపడుతున్న మెగా పీపుల్స్ సర్వే తార్కాణంగా నిలుస్తుందని చెప్పారు. ఈ నెల 7వ తేదీ నుంచి సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల నేతృత్వంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రతీ కుటుంబాన్నీ పలుకరిస్తాం...

జగనన్నే మా భవిష్యత్తు పేరుతో చేస్తున్న మెగా పీపుల్స్ సర్వేలో భాగంగా విజయనగరం జిల్లాలోని సుమారు 6.12 లక్షల కుటుంబాల్లో ఇప్పటివరకు 4.50 లక్షల కుటుంబాలను కలిశామని మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. ఆ కుటుంబాలతో మమేకమై ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలను తీసుకుంటున్నట్టు వెల్లడించారు. అధికశాతం ప్రజలు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలనకు మద్దతు పలుకుతున్నారని అన్నారు. సెల్: 82960 82960 నంబరుకు మిస్డ్ కాల్ చేసి అటు నుంచి ముఖ్యమంత్రి సందేశం ఆలకిస్తున్నారని చెప్పారు. ఆ కుటుంబాల అనుమతితోనే వారి ఇంటి గోడపై స్టిక్కరు అతికిస్తున్నామని స్పష్టం చేశారు. వాస్తవానికి పార్టీ నిర్ణయించిన ప్రకారం ఈనెల 20వ తేదీతోనే ఈ కార్యక్రమం ముగించాల్సి ఉందని, వేసవి తీవ్రత తదితర కారణాల వల్ల 29వ తేదీ వరకు కొనసాగించాలని ఆదేశాలు వచ్చాయన్నారు. మిగిలిన ఈ రెండు రోజుల్లో అన్ని కుటుంబాలనూ కలవాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. ఎవరికైనా ఏమైనా ఇబ్బందులున్నా, పాలనలో లోపాలను చెప్పినా సరిదిద్దుకోవడానికి తమ పార్టీ చర్యలు తీసుకుంటుందన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమల్లోకి తీసుకురావడంపై అన్ని వర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. ఆయన పాలననే మళ్లీ రావాలని కోరుకుంటున్నారని వెల్లడించారు. అదే సమయంలో గత చంద్రబాబు పాలనను ప్రజలు మరచిపోలేదన్నారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధికోసం అలవికాని 600కు పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఏవిధంగా మడం తిప్పిందీ ఇంకా గుర్తుంచుకున్నారని అన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పినా చంద్రబాబుకు అధికార దాహం తీరలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిపై బురదజల్లేందుకు అతను చేస్తున్న కుతంత్రాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. గత దఫా ఎన్‌డీఏ ప్రభుత్వంలో భాగస్వాములై అధికారం అనుభవించి, తీరా ఎన్నికలకు ముందు ప్రధానమంత్రి మోదీని వ్యక్తిగతంగానూ చంద్రబాబు దూషించి బయటకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేస్తుందన్న భ్రమతో ఆ పార్టీ నాయకులతో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన విషయం ఎవ్వరూ మరచిపోలేదన్నారు. మళ్లీ ఇప్పుడు మోదీపాలన బాగుందని చెబుతూ దగ్గరయ్యేందుకు తాపత్రయపడుతున్నారని, ఇవన్నీ చూస్తుంటే చంద్రబాబు అధికార దాహం అవగతమవుతుందని విమర్శించారు.

టీడీపీ నేతల సెల్ఫీలు సిగ్గుచేటు...

వేరొకరి హయాంలో జరిగినవీ తమ ఖాతాలో వేసుకోవడానికి ఏమాత్రం సిగ్గుపడని చంద్రబాబునే అనుసరిస్తూ టీడీపీ నాయకులు తీసుకుంటున్న సెల్ఫీలు సిగ్గుచేటని మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జాతీయ రహదారి పనులను తానే చేయించినట్లు అశోక్ గజపతిరాజు సెల్ఫీ తీసుకోవడం ఆయన స్థాయికి సరికాదన్నారు. ఆయన జిల్లాకు తేలేకపోయిన ప్రభుత్వ మెడికల్ కాలేజీని తమ ప్రభుత్వం నిర్మిస్తోందని, కనీసం అక్కడైనా సెల్ఫీ తీసుకుంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు.

అశోక్ బాధపడొద్దు... మీ కల నెరవేరుస్తాం...

గత సార్వత్రిక ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు హడావుడిగా టెంకాయ కొట్టేసిన భోగాపురం విమానాశ్రయం నిర్మాణం ఇప్పట్లో అవుతుందా? అని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు చాలా బాధపడుతున్నారని మజ్జి శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా, భూసేకరణపై కోర్టుల్లో న్యాయవివాదాలు పెండింగ్‌లోనున్నా, నిర్వాసితులకు దారి చూపించకుండానే చంద్రబాబులా చేస్తే బాధపడాలని, బహుశా అందుకే ఆరోజు శంకుస్థాపనకూ హాజరు కాలేదేమోనని అన్నారు. ఆ అనుభవంతోనే భోగాపురం విమానాశ్రయాన్ని ఇప్పట్లో చూస్తామా? అంటున్నారని ప్రస్తావించారు. ఆయన బాధపడనక్కర్లేదని, టిక్కెట్ కొనుక్కొని ఇక్కడి నుంచే విమానమెక్కే అవకాశం రానున్న మూడేళ్లలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తారని చెప్పారు. రూ.4,500 కోట్లతో జీఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించబోయే ఎయిర్‌ఫోర్ట్ నిర్మాణానికి వచ్చే నెల 3వ తేదీన జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. అన్ని అడ్డంకులనూ పరిష్కరించి, అన్ని అనుమతులూ తీసుకొని, నిర్వాసితులకు పూర్తి న్యాయం చేసిన తర్వాతే నిర్మాణ పనులకు పచ్చజెండా ఊపుతున్నారని చెప్పారు. అదేరోజున నెల్లిమర్ల నియోజకవర్గంలో మరో రెండు భారీ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారని వెల్లడించారు. మత్స్యకారుల కోసం చింతపల్లి తీరంలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి, రూ.195 కోట్లతో తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు పనుల పునఃప్రారంభానికి శంకుస్థాపన చేస్తారని వివరించారు. ఈ సందర్భంగా భోగాపురం మండలంలోని సవరవిల్లి గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న ముఖ్యమంత్రి బహిరంగసభకు ప్రజలంతా తరలిరావాలని, అంతా సమష్టిగా విజయవంతం చేయాలని కోరారు.

పక్కాగా సీఎం పర్యటన ఏర్పాట్లు

- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

భోగాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వచ్చేనెల 3వ తేదీన భోగాపురం ఎయిర్ పోర్ట్ శంకుస్థాపనకు రానున్నారని, ఏర్పాట్లను అధికారులందరూ సమన్వయంతో, పక్కాగా పూర్తిచేయాలని కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ ఆదేశించారు. ఎండల తీవ్రత దృష్ట్యా సభకు వచ్చేప్రజలకు తాగునీరు, మజ్జిగ సదుపాయం కల్పించాలన్నారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాల వద్ద తాగునీటి ట్యాంకర్లను ఏర్పాటు చేయాలన్నారు. భోగాపురం మండలంలో సీఎం సభావేదిక, జీఎంఆర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, హెలిప్యాడ్, శంకుస్థాపన శిలాఫలకాల వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. వాహనాల పార్కింగ్‌కు జాతీయ రహదారికి ఇరువైపులా రెండు చోట్ల ఏర్పాటుచేసిన ప్రదేశాలను జేసీ మయూర్‌అశోక్‌తో కలిసి పరిశీలించారు. ఆయా ప్రదేశాలకు బస్సులు, ఇతర వాహనాలు చేరేలా అప్రోచ్ రోడ్లను రోడ్లు భవనాల శాఖ ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ప్రముఖుల వాహనాల పార్కింగ్ కోసం కూడా ఒక ప్రదేశాన్ని గుర్తించాలని సూచించారు. బహిరంగ సభావేదికకు సమీపంలో 104 వాహనాలు, 108 అంబులెన్స్ వాహనాలను సిద్ధంగా ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశించారు. పర్యటనలో ఆర్డీఓ సూర్యకళ, చీపురుపల్లి ఆర్డీఓ అప్పారావు, ఎస్‌డీసీలు సూర్యనారాయణ, వెంకటేశ్వరరావు, పద్మలత, సుదర్శనదొర, డీపీఓ శ్రీధర్‌రాజా, డీఆర్‌డిఏ పీడీ కళ్యాణ్‌చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకర్, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఉమాశంకర్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములునాయుడు, రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ విజయశ్రీ, ఈఈ రమణ , డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవికుమార్, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు రామ్మోహన్, ఈశ్వర్, సీఐ కేవీవీ విజయనాథ్, ఎస్సైలు కృష్ణమూర్తి, సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

● దాహంతో గజగిజ



వేసవి తాపానికి మనుషులతో పాటు వన్యప్రాణులు విలవిల్లాడుతున్నాయి. దాహం తీర్చుకునేందుకు పరుగులు తీస్తున్నాయి. కొమరాడ మండలం వన్నాం గ్రామంలో కనిపించిన ఈ చిత్రమే దీనికి సజీవసాక్ష్యం. మాదలింగి, వన్నాం, పూజారిగూడ, పాలేం తదితర గ్రామాల్లో గజరాజులు నెల రోజులుగా తిష్ట వేశాయి. అందులోని ఒంటరి ఏనుగు వన్నాం రామమందిరం వద్ద ఉన్న చేతి పంపు వద్దకు గురువారం వచ్చి దాహార్తిని తీర్చుకుంది. తొండం సహాయంతో బోరు కొట్టి నీరు తాగింది. దీనిని గ్రామస్తులు తమ సెల్‌ఫోన్లలో రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్టుచేయడంతో కాస్త వైరల్ అయ్యింది.

– కొమరాడ

రక్తదానం ప్రాణదానంతో సమానం

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స



మొయిదలో మెగా రక్తదాన శిబిరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. మొయిదలోని ఆయన స్వగృహంలో మెగా రక్తదాన శిబిరం వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు. అపోహలు వీడి యువత రక్తదానానికి ముందుకు రావాలన్నారు. సంఘ సేవకుడు బొడ్డేపల్లి రామకృష్ణ రికార్డు స్థాయిలో 175వ సారి రక్తదానం చేయనున్న సందర్భంగా మే 1న విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహిస్తున్న మెగారక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. రామకృష్ణ సేవా స్ఫూర్తిని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎన్‌వీఎస్ బ్లడ్ బ్యాంకు, సేవా సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కడుబండి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం సాయంత్రం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే 'సాక్షి'తో ఫోన్లో మాట్లాడుతూ ఎస్.కోట నియోజకవర్గానికి సంబంధించి పలు అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చర్చించారన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' 'మా నమ్మకం నువ్వే జగన్' వంటి బృహత్తర కార్యక్రమాలతో ప్రజలకు మరింత చేరువకావాలని సూచించారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనుల కోసం ఒక్కో సచివాలయానికి కేటాయించిన రూ.20లక్షల బిల్లులు త్వరలో విడుదల చేస్తామని చెప్పారన్నారు. ఎన్ఆర్‌జీఎస్, నాన్ ప్రియారిటీ పనులకు సంబంధించిన పనులకు రూ.15కోట్లు విడుదల చేయాలని ముఖ్యమంత్రిని కోరగా ఇటీవల కొంత మేర నిధులు విడుదల చేశామని, మిగిలిన బిల్లులు త్వరలో విడుదల చేస్తామని చెప్పారన్నారు.

తండ్రి రుణం తీర్చుకున్న తనయ

- చివరి మజిలీలో ఆ నలుగురు లేక..
- ఎమ్మెల్యే సమకూర్చిన వాహనంలో శ్మశాన వాటికకు మృతదేహం తరలింపు



పెదపెంకి వెంకటరమణ (గుడ్డిమాస్టారు) (ఫైల్)



తండ్రి మృతదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న కుమార్తె చంద్రకళ

కురుపాం: ఆయన ఓ ట్యూషన్ మాస్టారు.. వందలాది మంది విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దారు. కొద్ది నెలలుగా అనారోగ్యంతో మంచం పట్టి బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించేందుకు ఆ నలుగురు కరువయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి వెంటనే స్పందించారు. జగతీ ఎమెర్జెన్సీ వాహనాన్ని పంపించారు. దానిపై మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించగా కుమార్తె చంద్రకళ దహనసంస్కారాలు పూర్తిచేసి తండ్రిరుణం తీర్చుకుంది. వివరాల్లోకి వెళ్తే... కురుపాం మండల కేంద్రంలోని శివ్వన్నపేటకాలనీకు చెందిన పెదపెంకి వెంకటరమణ(80) (గుడ్డి మాస్టారు) దశాబ్దాలపాటు మండల కేంద్రంలోని పలు వీధులు, ఇంటింటికీ వెళ్లి ట్యూషన్స్ చెప్పేవారు. ఆయన వద్ద చదువుకున్న వారు చాలామంది ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ట్యూషన్స్ చెప్పగా వచ్చిన డబ్బులతో భార్య, ఇద్దరు ఆడ పిల్లలను సాకేవారు. ఆర్థిక స్తోమత చాలకపోవడంతో పెద్దమ్మాయిని దత్తత ఇచ్చారు. చిన్నమ్మాయి చంద్రకళకు పెళ్లిచేశారు. సొంత ఇల్లులేక అద్దె ఇంటిలో ప్రభుత్వం అందిస్తున్న వృద్ధాప్య పింఛన్‌తో భార్యతో కలిసి జీవించేవారు. కొద్దినెలలుగా అనారోగ్యానికి గురై మృతి చెందడంతో గురువారం ఆయన చిన్నకుమార్తె తలకొరివిపెట్టి తండ్రి రుణం తీర్చుకుంది. మాస్టారు మృతి చెందిన వార్తను ఆలస్యంగా తెలుసుకున్న యువత, పెద్దలు కొందరు ఆర్థిక సాయం అందజేశారు.

క్లుప్తంగా

గణిత ఫోరం నూతన కార్యవర్గం


నూతనంగా ఎన్నికైన గణిత ఫోరం

విజయనగరం పూల్‌బాగ్: జిల్లాకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ గణితఫోరం నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్ త్రినాథరావు ఆధ్వర్యంలో ఎంఆర్ హైస్కూల్‌లో జరిగిన ఎన్నికలో ఫోరం గౌరవాధ్యక్షుడిగా ఐఎస్‌ఈ శర్మ, అధ్యక్షుడిగా వి చిన్నంనాయుడు, ప్రధానకార్యదర్శిగా కె.కృష్ణంరాజు, కోశాధికారిగా కె. చంద్రశేఖర్,ఉపాధ్యక్షులుగా డీవీ సూర్యనారాయణ, ఎం. శ్రీనివాసరావు, కె.శివప్రసాద్, బి.శ్రీనివాసరావు, ఎన్ రమేష్, కార్యదర్శులుగా ఎస్‌కె.హుస్సేన్, పి.శ్రీనివాసరావు, జోగేంద్ర, డి కామేశ్వరరావు, రామకృష్ణబాబు ఎన్నికయ్యారు.స్టేట్ కౌన్సిలర్స్‌గా ఎ లక్ష్మణరావు ఎన్నికయ్యారు.

నిర్వాసితులకు పట్టాల అందజేత


నిర్వాసితుడికి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా గృహాలు కోల్పోయి, 2015 ఆగస్టు 18 నాటికి అర్హులైన బొల్లింకలపాలెం, ముడసర్లపేట, మరడపాలెం, రెల్లిపేట, బైరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన 28 కుటుంబాలకు ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, మట్టా అయ్యప్ప, కొండపు కొత్తయ్యరెడ్డి, నిర్వాసితులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యాయత్నం

రాజాం సిటీ: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫెయిల్ అయిన ఇద్దరు విద్యార్థులు మనస్థాపంతో గురువారం ఆత్మహత్యాయత్నం చేశారు. రాజాం మండలం కంచరాం గ్రామానికి చెందిన వల్లూరు జగన్మోహనరావు ఇంట్లో ఎవరూలేని సమయంలో చీమల మందుతాగి తల్లికి ఫోన్‌చేసి చెప్పాడు. వెంటనే ఆమె అప్రమత్తమై భర్త జగన్నాథంతో కలిసి రాజాం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం నారన్నాయుడువలస గ్రామానికి చెందిన బిల్లాన మీనాక్షి కూడా ఇంటర్ ఫెయిల్ కావడంతో చీమల మందు సేవించిందని కుటుంబీకులు తెలిపారు. ఆమె కూడా రాజాం ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవలు పొందుతోంది. ఇరువురి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో శశి విద్యార్థుల సత్తా

తగరపువలస : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో సంగివలస శశి క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు సత్తా చాటారని చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. సెకండియర్ ఎంపీసీలో బి.సాయిప్రణీత 988, కె.తేజభరత్ 987, ఇ.గౌతమ్, కె.వి.ఎస్.చైతన్య, పి.నాగసాయి నిఖిత, బి.చరణ్‌లు 986 చొప్పున మార్కులు సాధించారన్నారు. 980కు పైగా మార్కులు 37 మంది, 970కు పైగా మార్కులు 91, 950కు పైగా మార్కులు 62 మంది విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను వై.ప్రశాంతి, నాగసాయిరామ్, పి.పూజితరామ్, సిహెచ్ హరిసాత్విక, పి.వి.వర్ధన్ 465 మార్కుల చొప్పున సాధించారన్నారు. 460కు పైగా మార్కులు 85 మంది, 450కు పైగా 218 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను కేటీ షణ్ముఖ శ్రీ, బి.శ్రీవల్లి, వై.తేజశ్రీ 435 చొప్పున మార్కులు సాధించారన్నారు. 430కు పైగా మార్కులు 19 మంది, 400కు పైగా 81 మంది విద్యార్థులు సాధించి సత్తా చాటారన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని అకడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ అభినందించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కే. 10గ్రా.)	61,040–00
బంగారం(22కే. 10గ్రా.)	55,950–00
వెండి (కిలో)	80,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

పట్టుబడిన మాయ'లేడీ'

- సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తింపు
- మూడు రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులు
- దొంగిలించిన రూ.60వేలు నగదు స్వాధీనం


బాధితుడికి నగదు అందజేస్తున్న సీఐ రవికుమార్

రాజాం సిటీ: రద్దీ ప్రాంతాల్లో ఏమరుపాటుగా ఉన్న వ్యక్తులను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న మాయలాడిని రాజాం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మూడు రోజుల్లోనే కేసు ఛేదించి నిందితురాలి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మున్సిపాల్టీ పరిధి కొండంపేట గ్రామానికి చెందిన పున్నాన కాంతమ్మ ఈ నెల 24న స్థానిక ఆంధ్రాబ్యాంకుకు వచ్చింది. తాను పద్దుపెట్టిన బంగారాన్ని విడిపించేందుకు రూ. 60వేలు తీసుకువచ్చింది. లైన్‌లో ఉన్న కాంతమ్మ చేతి సంచిలో నగదును బ్యాంకులో మాటువేసిన ఓ మహిళ చేతివాటం ప్రదర్శించి అపహరించి అక్కడి నుంచి పరారైంది. కాసేపటికే నగదు అపహరణకు గురైన విషయం తెలుసుకున్న కాంతమ్మ తొలుత బ్యాంకు సిబ్బంది, తరువాత పోలీసులను ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదు చేసిన రాజాం ఎస్సై వై.రవికిరణ్, క్రైం సిబ్బంది సుగుణాకరరావు, శ్రీరాములు, రాజేంద్రల సహాయంతో బ్యాంకులో సీసీ పుటేజీలతోపాటు బయట షాపుల వద్ద అమర్చిన సీసీ పుటేజీలను పరిశీలించారు. దొంగతనం చేసింది మహిళగా తెలుసుకుని ఆ దిశగా దర్యాప్తు చేపట్టి పశ్చిమగోదావరి జిల్లా దేవరాపల్లికి చెందిన కోదాడ ఏసమ్మను నిందితురాలిగా గుర్తించారు. ఆమె కోసం ఆరా తీయగా తాడేపల్లిగూడెం మండలం యాగర్లపల్లి గ్రామంలో బంధువుల ఇంటి వద్ద ఉన్నట్లు తెలుసుకున్నారు. అక్కడికి వెళ్లి ఆమెను అరెస్టు చేసి రూ.60వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు.

చోరీకి గురైన నగదు అందజేత

రాజాం సిటీ: రాజాం పట్టణంలో రెండు నెలల క్రితం దొంగతనానికి గురైన నగదును సీఐ కె.రవికుమార్ గురువారం బాధితుడికి అందజేశారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సంతకవిటి మండలం చిన్నయ్యపేటకు చెందిన ఆర్.జనార్దనరావు ఈ ఏడాది ఫిబ్రవరి 28న బ్యాంకులో రూ.2 లక్షలు విత్‌డ్రా చేసి బండి డిక్కీలో ఉంచి పాలకొండ రోడ్డులోని ఓ షాపింగ్ కాంప్లెక్స్ ముందు పార్కింగ్ చేసి షాపింగ్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి డిక్కీ తెరిచి ఉండడం, అందులో నగదు లేకపోవడంతో రాజాం పోలీసులను ఆశ్రయించాడు. దీంతో రంగంలోకి దిగిన క్రైం సిబ్బంది సీసీ పుటేజీల ఆధారంగా చిత్తూరు జిల్లా నగరి మండలం ఓజీకుప్పంలో నిందితుడు ఉన్నట్లు గుర్తించారు. ఈ నెల 1న అక్కడికి వెళ్లి నిందితుడు సుబ్రహ్మణ్యాన్ని అదుపులోకి తీసుకుని రూ. 2 లక్షల నగదు రికవరీ చేశారు. ఆ నగదును రాజాం కోర్టు ఆదేశాల మేరకు బాధితుడు జనార్దనరావుకు అందజేశారు.

సహనానికి ప్రతిరూపం భగీరథుడు

- నివాళులర్పించిన కలెక్టర్ నాగలక్ష్మి


నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: మహర్షి భగీరథుడు పరోపకారానికి..సహనానికి ప్రతిరూపమని ఆయన చేసిన అకుంఠిత దీక్షలు కచ్చితంగా నేటితరం యువతలో స్ఫూర్తిని నింపుతాయని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్.పేర్కొన్నారు. భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని వెనుకబడిన సంక్షేమ తరగతుల శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లో గురువారం వేడుకలను నిర్వహించారు. కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు భగీరథుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భగీరథుడు ఎంత కష్టాన్నైనా లెక్క చేయకుండా అనుకున్నది సాధించే తత్వం కలిగిన మనిషని అందుకే ఆయన మహర్షి అయ్యారని అన్నారు. ఆయన బాటలో మనం కూడా నడిచి పెట్టుకున్న లక్ష్యాలను అకుంఠిత దీక్షతో సాధించాలని పేర్కొన్నారు. నేటి తరం యువత మహనీయుల జీవిత విశేషాలను తెలుసుకోవాలని వాటిలో కొన్నింటినైనా ఆచరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌ఓ గణపతిరావు, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి యశోధనరావు, కార్పొరేషన్ ఈడీ పెంటోజీరావు, డీఎస్‌ఓ సదర్శనరావు, బీసీ సంక్షేమ శాఖ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ పరిధిలో నలుగురికి కారుణ్య నియామకాలు


నియామక ఉత్తర్వులను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- ఉత్తర్వులు అందజేసిన చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: జిల్లాపరిషత్ పరిధిలోని వివిధ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన నలుగురు ఉద్యోగుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించారు. నియామక పత్రాలను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గురువారం అందజేశారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని వివిధ కార్యాలయాల్లో సహాయకులుగా నియమించారు. విజయనగరం జిల్లాకు సంబంధించి తాడ్డి ఉషను ఎస్.కోట మండలం ధర్మవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలోను, గొడబ అఖిల్‌ను జామి మండల పరిషత్ కార్యాలయంలో సహాయకుడిగా నియమించారు. పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి చోడిపల్లి సంజయ కుమార్‌ను జియ్యమ్మవలస మండలపరిషత్ కార్యాలయంలో, మామిడి సత్యనారాయణను కురుపాం మండలపరిషత్ కార్యాలయంలో సహాయకుడిగా నియమించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ డా.అశోక్ కుమార్, డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రామతీర్థంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- మూడు నెలల్లో పూర్తి చేయాలి
- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు


యాగశాల వద్ద అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులను మూడు నెలల వ్యవధిలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సూచించారు. ఈ మేరకు రామతీర్థం దేవస్థానంలో రూ.కోటి సీజీఎఫ్ నిధులతో చేపట్టబోయే అభివృద్ధి పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ముందుగా యాగశాల వద్ద అర్చకుల వేద మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ ఆధ్యాత్మికతకు తొలి ప్రాధాన్యమిస్తూ దేవస్థాన అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో బోడికొండపై రూ.3కోట్ల నిధులతో కోదండ రామాలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించుకున్నామని చెప్పారు. ప్రధానాలయంలో కోటి రూపాయలతో అభివృద్ధి పనులు జరగనున్నాయని తెలిపారు. క్షేత్రానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పనులు జరగాలని నిర్వాహకులకు సూచించారు. ఆలయంలో ఫ్లోరింగ్, శాశ్వత యాగశాల నిర్మాణం, ఉత్తర రాజగోపురం అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పనులకు సంబంధించిన వివరాలను దేవాదాయ శాఖ అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో ఈఓ కిశోర్ కుమార్, డీఈఈ కేవీసీ కృష్ణ, ట్రస్టుబోర్డు సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గల ఏకలవ్య మోడల్ పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆరవ తరగతిలో ప్రవేశానికి, 7వ తరగతినుంచి 9వ తరగతివరకు బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ చేపట్టారు. ఇందుకోసం ఏప్రిల్ 15లోగా దరఖాస్తు చేయని అభ్యర్థులు ఈనెల 30న ఈఎంఆర్‌ఎస్ ప్రవేశ పరీక్షా కేంద్రాలకు (పి.కోనవలస, గుమ్మలక్ష్మీపురం, జోగింపేట) ఉదయం 10 గంటలకు ఆధార్‌కార్డు, ఫొటో, కుల ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని పీఓ విష్ణుచరణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- మత్స్యశాఖ డీడీ నిర్మాలకుమారి


సమావేశంలో మాట్లాడుతున్న నిర్మలా కుమారి

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని మత్స్యశాఖ డీడీ నేతల నిర్మలాకుమారి సూచించారు. ఈ మేరకు స్థానిక ఫిష్ సీడ్ ఫాంలో గురువారం మత్స్యకారులకు నైపుణ్యాభివృద్ధిపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సముద్రంలో చేపల వేటకు వెళ్లేటప్పుడు ఉపయోగించాల్సిన రక్షణ పరికరాల గురించి తెలుసుకుని, ఇతర మత్స్యకారులకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు బర్రి చిన్నప్పన్న సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ అండ్ ఇంజినీరింగ్ ట్రైనింగ్ యూనిట్ విశాఖపట్నం ప్రతినిధులు మహాదేవ్ కొంకణి, అభిషేక్, నిశిత్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి చాందిని తదితరులు పాల్గొన్నారు.

పలువురిపై బైండోవర్ కేసుల నమోదు


వీరఘట్టం: తహసీల్దార్ చందక సత్యనారాయణ


భామిని: సతివాడ వివాదాలపై రెండు వర్గాలకు బైండోవర్ విధిస్తున్న తహసీల్దార్ అప్పారావు, ఎస్సై అమ్మన్‌రావు

వీరఘట్టం: గతంలో సారా అమ్మకాలు చేపట్టిన, సారా తరలిస్తూ పట్టుబడిన, బడ్డీ కొట్టులో బుడ్డీలు విక్రయించిన 15 మందిపై వీరఘట్టం తహసీల్దార్ చందక సత్యనారాయణ బైండోవర్ నమోదు చేశారు. గతంలో వారిపై కేసులు నమోదు చేసిన పోలీసులు తహసీల్దార్ ముందు హాజరుపరిచారు. వారితో తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అలాగే ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లి హాయిగా జీవించవచ్చని హితవు పలికారు.

భామినిలో..

భామిని: మండలంలోని సతివాడలో రేగిన స్థల వివాదంలో కొట్లాటకు దిగిన రెండు వర్గాలకు చెందిన 18 మందిపై బైడోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వై.అమ్మన్‌రావు గురువారం తెలిపారు. తహసీల్దార్ నీలాపు అప్పారావు ముందు రెండు వర్గాలను హాజరుపరచగా వివాదాస్పద స్థలం జోలికి ఎవరూ వెళ్లవద్దని, డాక్యుమెంట్ల ప్రకారం అప్పగిస్తామని వారికి తెలిపారు. అనంతరం రోజంతా సతివాడలో పికెట్ ఏర్పాటు చేసి వివాదాలకు ఆస్కారం లేకుండా చూశామని ఎస్సై తెలిపారు.

ఆరుగురిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు

మండలంలో గురువారం చేసిన డ్రంకన్ డ్రైవ్‌లో ఆరు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై అమ్మన్‌రావు తెలిపారు. బహిరంగ మద్యపానంపై కూడా కేసులు పెట్టి, అరెస్టు చేస్తామని హెచ్చరించారు.

గ్రామానికి చేరిన ఆర్మీ జవాన్ మృతదేహం


అవలంగిలో ఆర్మీజవాన్ అరుణ్‌కుమార్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న అధికారులు, గ్రామస్తులు

పాలకొండ రూరల్: విధి నిర్వహణలో అస్వస్థతకు గురైన ఆర్మీ జవాన్ నగరపు అరుణ్‌కుమార్ (36) ఈనెల 24న వెస్ట్‌బెంగాల్‌లో మృతిచెందారు. ఆయన మృతదేహం బుధవారం రాత్రి స్వగ్రామమైన పాలకొండ మండలం అవలంగికి చేరింది. ఆర్మీ అధికారులు ప్రత్యేక వాహనంలో మృతదేహాన్ని తీసుకువచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. గురువారం సంప్రదాయబద్ధంగా జవాన్ మృతదేహాన్ని ఖననం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత సైనికోద్యోగుల సంఘం నాయకులు దుప్పాడ పాపినాయుడు, ప్రసన్నకుమార్, వెన్నపు వెంకటరమణతో పాటు పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు. అశ్రునయనాల మధ్య అరుణ్‌కుమార్‌కు స్థానికులు, అధికారులు నివాళులర్పించారు.

పురుగు మందు తాగేసిన విద్యార్థి..

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని గదబవలస గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి కోండ్రు హరీష్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది పురుగు మందు తాగేశాడు. బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఫస్టియర్, సెకెండ్ ఇయర్‌లో పలు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో కుటుంబ సభ్యులు ఏమైనా అంటారేమోనని భయాందోళనకు గురై ఇంట్లో ఉంచిన పురుగు మందు తాగేశాడు. కొంత సమయం తరువాత స్పృహ తప్పిపోవడంతో విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి, అక్కడినుంచి విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఈ విషయమై గరివిడి ఎస్సై ఎల్.దామోదర్‌రావు వద్ద ప్రస్తావించగా ఈ విషయం తమ నోటీసులోకి వచ్చిందని,ఫైల్ చేసుకున్నామని తెలిపారు.

ఆటో, బైక్ ఢీకొని యువకుడికి గాయాలు


గాయపడిన గంటాన వాసు

చీపురుపల్లి: పట్టణంలోని లావేరు రోడ్‌లో గురువారం సాయంత్రం ఆటో, బైక్ ఢీ కొన్న సంఘటనలో గంటాన వాసుకు గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో 108 వాహనంలో క్షతగాత్రుడిని తరలించి చీపురుపల్లి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో చేర్పించి వైద్య సహాయం అందిస్తున్నారు. మండలంలోని రావివలస గ్రామానికి చెందిన గంటాన వాసు ద్విచక్ర వాహనంపై చీపురుపల్లి వస్తుండగా అదే రోడ్‌లో భారత్ గ్యాస్ ఆటో గొడౌన్‌కు వెళ్లోంది. రెండు వాహనాలు ఎదెరెదురుగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది.

ఉన్న ఊరిలో 'ఉపాధి'

- జాతరలా వెళ్తున్న వేతనదారులు
- జిల్లాలో జోరుగా సాగుతున్న పనులు
- రోజుకి 2.09 లక్షల మంది హాజరు


గజపతినగరం మండలం పిడిశీలలో పని చేస్తున్న వేతనదారులు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఉపాధి వేతనదారుల జాతర కొనసాగుతోంది. పల్లెల్లో ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. ఉదయం 6 గంటలకల్లా గ్రామాల్లో ఉన్న వేతనదారులంతా కదిలి వెళ్లి పనిలో నిమగ్నమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది వేతనదారులు ఉపాధిహామీ పనికి హాజరవుతున్నారు. సొంత గ్రామంలోనే పనిదొరకడంతో వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. అధికారులు కూడా పని అడిగిన ప్రతి ఒక్కరికీ కల్పిస్తున్నారు. దరఖాస్తు చేసిన 24 గంటల్లో జాబ్ కార్డు మంజూరు చేస్తున్నారు. దీంతో పనికి వెళ్లడం సులభతరమవుతోంది. వేతనదారులకు కనీస వేతనం వచ్చేలా చేయడం కోసం రెండు పూటలా పని కల్పిస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయత్రం 5 గంటల వరకు వేతనదారులు పనిచేస్తున్నారు.

జిల్లాలో జాబ్ కార్డులు 3.45 లక్షలు

జిల్లాలో లక్షల్లో వేతనదారులు ఉన్నారు. వారంతా ఉపాధి పనులకు వెళ్తున్నారు. 3.45 లక్షల జాబ్ కార్డులుండగా 6,11,286మంది వేతనదారులు ఉన్నారు. 2023–24 సంవత్సరంలో వారికి పని కల్పించడం ద్వారా రూ.565.46 కోట్లు వేతనం చెల్లించనున్నారు.

పని ప్రదేశంలో ఏర్పాట్లు

జిల్లాలోని 27 మండలాల్లో ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి. రోజుకు 2.09 లక్షల మంది పనికి వెళ్తున్నారు. ఉపాధి పనిచేసే చోట వేతన దారుల కోసం అధికారులు టెంట్లు ఏర్పాటు చేశారు. అలాగే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు కూడ అందిస్తున్నారు.

రాష్ట్రంలో జిల్లా టాప్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై లిబ్‌టిక్ అనే సంస్థ రాష్ట్రంలో సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఆ నివేదికలో రాష్ట్రంలోని మిగతా జిల్లాల కంటే అత్యధిక పనిదినాలు కల్పించడంలో విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. లీడర్, యావరేజ్, వెనుకబడిన విభాగాల్లో సర్వే చేయగా విజయనగరం జిల్లాకు లీడర్ వచ్చింది.

చేపట్టే పనులిలా..

ఉపాధిహామీ పథకం ద్వారా నీటి వనరులు, వాగులు, కుంటలు, చెరువుల ఆధునికీకరణ, పొలాల చుట్టూ సరిహద్దులు, అంతర్గతంగా కందకాలు, పంటకుంటలు, ఊట కుంటలు, ఇంకుడు గుంతల తవ్వకం వంటి పనులు చేస్తున్నారు. అలాగే జగనన్న పచ్చతోరణం పథకంలో భాగంగా రహదారులకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ ప్రదేశాలు, చెరువుల గట్లపై మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం చేస్తున్నారు. రైతుల పొలాల్లో ఉద్యాన, పండ్ల తోటల సాగును ప్రోత్సహిస్తారు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, డిజిటల్ లైబ్రరీలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్స్, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్స్ భవనాలు, ప్రహరీలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు.

జోరుగా పనులు



జిల్లాలో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. సగటున 2 లక్షలకు పైగా వేతనదారులు పనులకు వస్తున్నారు. అత్యధిక పనిదినాలు కల్పించడంలో రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది.

జి. ఉమాపరమేశ్వరి, పీడీ, జిల్లా నీటియాజమాన్య సంస్థ